# సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం, 7, అక్టోబర్, 2023






**10 కోర్టులు మంజూరు**
ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 10 కోర్టులు మంజూరు చేస్తూ న్యాయశాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. - 8లో



**రైతుల సేవలో సహకార బ్యాంకు**
రైతులకు రుణాలు అందించడంలో డీసీసీబీ ముందంజలో ఉందని చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. - 8లో



**ప్రతీ వర్గానికి మేలు**
సీఎం కేసీఆర్ పాలనలో ప్రతీ సామాజిక వర్గానికి మేలు జరిగిందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 9లో

## న్యూస్‌రీల్

### యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజలి సేవ చేపట్టారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

### మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



చీరలు పంపిణీ చేస్తున్న సందీప్‌రెడ్డి

బొమ్మలరామారం : బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని జెడ్పీ చైర్మన్ లిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో శుక్రవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. ఏటా బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు కానుకగా చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, ఎంపీపీ సరిత, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, ఎంపీటీసీ కుర్మిండ్ల కావ్య ఈశ్వర్ గౌడ్, సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌గౌడ్, మన్నె శ్రీధర్, ప్యారారం రాములు పాల్గొన్నారు.

### 10,11 తేదీల్లో నాటక ప్రదర్శనలు

భువనగిరిటౌన్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై ఈనెల 10, 11 తేదీల్లో సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనలు ఉంటాయని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు చౌటుప్పల్‌లోని కళాశ్రీ ఫంక్షన్ హాల్‌లో, 11న సాయంత్రం 6.30కి భువనగిరిలోని వైఎస్సార్ గార్డెన్‌లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ధర్మారెడ్డి కాలువను పూర్తి చేయడంలో విఫలం



కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : ధర్మారెడ్డిపల్లి కాలువను సకాలంలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీపీఎం, రైతు సంఘం నాయకులతో కలిసి రామన్నపేట మండల పరిధిలో ధర్మారెడ్డి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో మూసీ జలాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బడుగు రమేష్‌బాబు నాయకులు బల్గూరి అంజయ్య, అంబటి సురేందర్‌రెడ్డి, కూనూరు గణేష్, దోమలపల్లి నర్సింహ, కంకల శేఖర్ పాల్గొన్నారు.

### ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఉపేందర్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సముద్రాల ఉపేందర్ నియమితులయ్యారు. ఉపేందర్ ప్రస్తుతం సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గణిత లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జేడీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

# ఉరుకులు.. పరుగులు

- క్షణం తీరిక లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- ఎన్నికల షెడ్యూల్ రాకముందే కార్యక్రమాలన్నీ పూర్తిచేసే పనిలో..
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి
- సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకం



మహబూబ్‌పేటలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



వలిగొండలో గృహలక్ష్మి లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : శాసనసభకు ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలతో క్షణం తీరికలేకుండా గడుపుతున్నారు. తమ ఖాతాలో వేసుకోవడానికి షెడ్యూల్‌కు ముందే కార్యక్రమాలను పూర్తి చేస్తున్నారు. వీటితో పాటు గృహలక్ష్మి, బీసీబంధు, మైనార్టీబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్, చెక్కులు అందజేస్తున్నారు. సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు.

**ఆలేరు నియోజకవర్గం :** ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత రెండు నెలల నుంచే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలపై ఫోకస్ పెట్టింది. ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో మరింత వేగం పెంచారు. ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, కుల సంఘాల భవనాలకు శంకుస్థాపనలు చేస్తున్నారు. పూర్తయిన పనులకు ప్రారంభోత్సవం చేస్తున్నారు. యువ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో భాగంగా క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్నారు. అలాగే బీసీబంధు, మైనార్టీబంధు లబ్ధిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులు, గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తూ బిజీగా గడుపుతున్నారు. వీటితో పాటు సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేసే పనిలో ఉన్నారు.

**భువనగిరి :** ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఇంద్రియాల– శివారెడ్డిగూడెం మధ్యన మూసీపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, అంతర్గత డ్రెయినేజీలు, బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్నారు. పూర్తయిన పనులను ప్రారంభిస్తున్నారు. సొంత డబ్బులతో యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారు. గృహలక్ష్మి, బీసీబంధు, మైనార్టీబంధు లబ్ధిదారులకు చెక్కులు, ప్రొసీడింగ్స్ అందజేస్తున్నారు.

**మునుగోడు :** చౌటుప్పల్ మున్సిపాలిటీ, చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, కుల సంఘాల భవనాలకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ బిజీగా ఉన్నారు. చౌటుప్పల్‌లో 72 డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

**తుంగతుర్తి :** మానాయకుంట – గురజాల వద్ద మూసీ నదిపై నిర్మించిన వంతెనను ఇటీవల ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌కుమార్ ప్రారంభించారు. అదే విధంగా ఫణిగిరిలో ఆర్కియాలజీ శాఖ మ్యూజియాన్ని ప్రారంభించారు. వీటితో పాటు కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులపై దృష్టి సారించారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి, బీసీబంధు ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ చెక్కులు అందజేస్తున్నారు.

**రాష్ట్ర నాయకుల రాక**

అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యేలు రాష్ట్రస్థాయి నేతలను రప్పిస్తున్నారు. ఇందులో భాగంగా రామన్నపేటలో ఇటీవల జరిగిన ప్రభుత్వ ఆస్పత్రి భవనం, సబ్ ట్రెజరీ కార్యాలయం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు.

**ఎమ్మెల్యేలకు నిరసన సెగ**

ఎమ్మెల్యేలకు కొన్ని వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి వంటి పథకాలను బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని, అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆందోళనకు దిగుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఉద్రిక్తతకు దారి తీసిన సంఘటనలు ఉన్నాయి.

## బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పథకాలు



మాట్లాడుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- ప్రభుత్వ తీరును నిరసిస్తూ 9వ తేదీన మహాధర్నా
- డీసీసీ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి వంటి పథకాల అమలులో బీఆర్‌ఎస్ నాయకుల జోక్యం పెరిగిందని, వారి కార్యకర్తలనే ఎంపిక చేస్తున్నారని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పథకాల అమలులో బీఆర్‌ఎస్ నాయకుల జోక్యాన్ని నిరసిస్తూ భువనగిరిలో ఈనెల 9వ తేదీన మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించడం లేదన్నారు. అధికార పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెప్పిన వారి పేర్లతో రాత్రికిరాత్రే జాబితాలు తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఇతర పార్టీల వారిని పరిగణలోకే తీసుకోవడం లేదన్నారు. భువనగిరిలో ఓ కౌన్సిలర్, కౌన్సిలర్‌గా నిలబడిన వ్యక్తిని గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేయడం శోచనీయమన్నారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు కేవలం ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, వారి ఖాతాల్లో వెంటనే డబ్బులు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తి కాకుండానే పంపిణీ చేశారని, సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దళితబంధు డబ్బులు పంచుకోమని దళితుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు రావడం లేదన్నారు.

**ఎమ్మెల్యేను అడ్డుకుంటాం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసనగా ఎమ్మెల్యే పర్యటనలను అడ్డుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి టికెట్ బీసీలకు ఇవ్వాలని అధిష్టానం నిర్ణయిస్తే కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి 40 ఏళ్ల కల నెరవేరుస్తామని, కార్యకర్తలు కూడా సైనికుల్లా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు కూర వెంకటేశం, నాయకులు కుక్కదువ్వ సోమయ్య, బీసుకుంట్ల సత్యనారాయణ, వనతి, నజీర్, చిక్కుల వెంకటేశం, మజహార్, అవైస్‌చిస్తీ, రఫియోద్దీన్ ఉన్నారు.

### ఎయిమ్స్‌లో 5 లక్షల మందికి వైద్యం




మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్ : రాష్ట్ర ప్రజలకు బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు అందజేస్తున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా పేర్కొన్నారు. ఎయిమ్స్‌లో ఓపీడీ సంఖ్య 5 లక్షలకు చేరిన సందర్భంగా శుక్రవారం ఎయిమ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2020 జూన్ 2వ తేదీన ఎయిమ్స్‌లో అవుట్ పేషెంట్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. 2022 మే నాటికి లక్ష, ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 5లక్షలకు ఓపీడీ కేసులు చేరినట్లు వెల్లడించారు. ఎయిమ్స్‌లో అందజేస్తున్న సేవలకు ఇది మైలురాయిగా నిలుస్తుందన్నారు. 32 రకాల వైద్య సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి రోజూ 2వేల మంది వరకు రోగులు వస్తున్నారని, వైద్య సేవలను మరింత విస్తరించి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్ ఇన్

ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 12 వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై శనివారం 'సాక్షి'ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రెయినేజీలు, దోమల బెడద తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేదీ : 07-10-2023
ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ : 63004 87155



పి.చక్రపాణి
మున్సిపల్ కమిషనర్,
ఆలేరు

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వలిగొండ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వలిగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. వలిగొండలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, అందులో భాగంగానే విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రవేశపెట్టిందన్నారు. మెనూ ప్రకారం అల్పాహారం అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం భుజించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, వారి చదువుపై ఇంటి వద్ద శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ భాస్కర్‌రావు, డీఈఓ నారాయణరెడ్డి, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నూతి రమేష్, జెడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, సర్పంచ్ బోల్లలలితా శ్రీనివాస్, ఎంపీటీసీలు పలుసం రమేష్, కుందారపు యశోద, పల్లెర్ల భాగ్యమ్మ రాజు, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, సుర్కంటి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి**

సాక్షి, యాదాద్రి : పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు, వ్యవసాయ, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో కలెక్టర్ సమావేశం అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 1,02,777 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారని, 5,13,888 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం వుందన్నారు. అందుకు అనుగుణంగా భువనగిరి, మోత్కూర్, ఆలేరు, చౌటుప్పల్, వలిగొండ వ్యవసాయ మార్కెట్‌ల పరిధిలోని 14 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.7,020 మద్దతు ధర ప్రకటించిందని, రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని, ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రచారం చేయాలని కోరారు. రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్‌లు అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నీలిమా, మార్కెట్ కార్యదర్శులు పద్మజ, అంజిత్‌రావు, ఎల్లయ్య, ఉమామహేశ్వర్, వహీద్, అగ్నిమాపక శాఖ, లీగల్ మెట్రాలజీ, పోలీస్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

## అల్పాహార పథకం.. గొప్ప నిర్ణయం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత




మర్యాల పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న ప్రభుత్వ విప్ సునీత

బొమ్మలరామారం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం దేశంలో మరే రాష్ట్రంలో లేదని, సీఎం కేసీఆర్ చారిత్రక నిర్ణయం తీసుకున్నారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. బొమ్మలరామారం మండలం మర్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో భాగంగా విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్నం భోజనం, రాగి జావ లాంటి బలవర్ధక ఆహారం అందజేస్తుదన్నారు. తాజాగా పోషకాలతో కూడిన అల్పాహారం అందజేయడం హర్షణీయమన్నారు. ఉదయం వేళ ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత పెరగడానికి అల్పాహార పథకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, మండల నోడల్ అధికారి జ్యోత కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ కుడుదుల నగేష్, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, ఎంపీడీఓ సరిత, ఎంఈఓ కృష్ణ, హెచ్‌ఎం నిర్మల జ్యోతి, ఎంపీటీసీ కావ్య ఈశ్వర్‌గౌడ్, సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌గౌడ్ పాల్గొన్నారు.

# పత్తికి తెగుళ్ల ముప్పు

- జాజు రోగం, పచ్చదోమ, పేనుబంక బారిన చేలు
- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- పూత, కాత దశలో రైతులకు తప్పని దిగులు



ఆత్మకూర్(ఎం) మండలం కొరటికల్‌లో జాజు తెగులు సోకడంతో రంగుమారిన చేను

రామన్నపేట, ఆత్మకూరు(ఎం) : పత్తి రైతుల వేదన వర్ణనాతీతంగా ఉంది. పంట చేతికొస్తున్న తరుణంలో తెగుళ్లు చుట్టుముట్టడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితుల్లోనే పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. తాజాగా మళ్లీ అవే పరిస్థితులు పునరావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయని రైతులు దిగులు చెందుతున్నారు.

**1,02,777 ఎకరాల్లో పత్తి సాగు**

జిల్లాలో 1,02,777 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది. చేలు ఆశాజనకంగా ఉండడంతో రెండు, మూడేళ్లుగా నష్టాలను చవిచూసిన రైతులు ఈ సారైనా గట్టెక్కుతామన్న ఆశతో ఉన్నారు. కానీ, క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలతో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. ముఖ్యంగా జాజు తెగులు పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చేలు ఎర్రబారి పత్రాలు రాలిపోతున్నాయి. మొక్కలు పోషకాలను తీసుకోలేని స్థితిలో ఉంటాయి. దీంతో పాటు పచ్చదోమ, పేనుబంక, లద్దెపురుగు, ఆంత్రాక్నోస్ తెగులు ఆశిస్తున్నాయి. మబ్బులతో కూడిన వాతావరణం, వర్షాలు క్రమం తప్పకుండా కురుస్తుండడంతో తెగుళ్ల బెడద అధికమవుతోంది.

**దిగుబడిపై ప్రభావం**

వాతావరణం అనుకూలిస్తే సాధారణంగా ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. కానీ, ఈసారి తెగుళ్ల కారణంగా 4నుంచి 6 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. దున్నకాలు, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇతరత్రా ఇప్పటి వరకు ఎకరాకు రూ.37,200 వేలు ఖర్చు వచ్చిందని, పెట్టుబడి వెళ్లే పరిస్థితి కూడా లేదంటున్నారు. ప్రస్తుతం పాత పత్తి మార్కెట్‌లో క్వింటా రూ.6,900కు కొనుగోలు చేస్తుండగా కొత్త పత్తి రూ.5.500కు తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం పత్తికి క్వింటా రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది.

**మొన్నటి వరకు ఆశ ఉండే**



గత ఏడాది నాలుగు ఎకరాలు పత్తిసాగు చేశాను. వర్షాలు లేక ఆశించిన దిగుబడి రాలేదు. ధర పెరుగుతుందని పత్తి నిల్వ చేశాను. నాలుగు నెలలు చూసినా ఆశించిన ధర రాలేదు. ధర లేక నష్టపోయాను. ఈ యేడు కూడా నాలుగు ఎకరాలు సాగు చేశాను. వరుస వర్షాలు కురుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

– పోచబోయిన చిన్న నర్సింహ, జనంపల్లి

**తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు**

- పత్తి చేలకు తెగుళ్లు సోకుతున్నాయి. సస్యరక్షణ చర్యలు తప్పనిసరగా పాటించాలి. జాజు తెగులు నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, పది గ్రాముల యూరియా, డీఏపీ వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- పొగాకు లద్దెపురుగు ఆశించిన మొక్కల పత్రాలపై వివిధ ఆకారాల్లో రంధ్రాలు ఏర్పడి జల్లెడగా మారుతాయి. నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5గ్రా లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పచ్చదోమ ఆశిస్తే పత్రాలు ముడతపడి ఎర్రటి ఇటుక రంగులోకి మారుతాయి. మోనోక్రోటోఫాస్ 2 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లేదా ఫ్రిప్రోనిల్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఆంత్రాక్నోస్ తెగులు సోకిన మొక్కల పత్రాలపై గుండ్రని ఎరుపురంగు మచ్చలు, కాయలపై ముదురు ఎరుపు లేదా ఉదారంగులో చిన్న గుంతల్లాంటి మచ్చలు ఏర్పడతాయి. కాయ పగిలి పత్తి రంగు మారుతుంది. నివారణకు కలుపు మొక్కలు తొలగించాలి. మాంకోజెల్ 2.5 గ్రా లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ (సీఓసీ) 3.0 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్, రామన్నపేట మండల వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటన్న రైతులకు సూచిస్తున్నారు.

**చేనంతా ఎర్రబారింది**



గత సంవత్సరం కంది పంట వేశాను. లాభదాయకంగా ఉంటుందని ఈఏడాది పత్తి సాగు చేశాను. ఇప్పటి వరకు రూ.60 వేల వరకు పెట్టుబడి వచ్చింది. పది రోజుల క్రితం వరకు చేను బాగుంది. కానీ, క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తుండడంతో చేనంతా ఎర్రబారింది. కాసిన కాయ నిలబడిపోయింది. సైజ్ పెరగడం లేదు. దిగుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఆందోళనగా ఉంది.

– ముత్యాల సత్తయ్య, రహీంఖాన్‌పేట

**సస్యరక్షణ చర్యలు తప్పనిసరి**



గత కొద్ది రోజులుగా క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తుండడంతో పత్తి చేలు జాజు తెగులుకు గురయ్యాయి. రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి మందులు పిచికారీ చేస్తే జాజు తెగులునుంచి పంటలను కాపాడుకోవచ్చు. ప్రతి వ్యవసాయ క్లస్టర్‌లో ఏఈఓను అందుబాటులో ఉంచాం. ఏసమస్య ఉన్నా వారిని సంప్రదించాలి.

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి

## క్లుప్తంగా

### సాగర్‌లో ఫిజీషియన్ల కాన్ఫరెన్స్

● నేడు, రేపు నిర్వహణ



కాన్ఫరెన్స్‌కు ముస్తాబైన విజయవిహార్

నాగార్జునసాగర్: టీఎస్ ఏపికాన్ – 2023, ఫిజీషియన్ల ఏడవ వార్షిక సమావేశాలు నాగార్జునసాగర్‌లో 7, 8 తేదీలలో జరుగనున్నాయి. అందుకుగాను విజయవిహార్ ముస్తాబైంది. తెలంగాణ రాష్ట్రంలోని ఫిజీషియన్లతో పాటు పీజీ చేస్తున్న విద్యార్థులు ఈ కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారు. పలు అంశాలపై చర్చించేందుకు దేశవ్యాపితంగా ఉన్న పలు విశ్వవిద్యాలయాల నుంచి నిపుణులు వస్తున్నట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రానికి చాలామంది డాక్టర్లు విజయవిహార్‌కు చేరుకున్నారు. కాన్ఫరెన్స్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ కోటిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భగత్‌కుమార్ హాజరుకానున్నారు.

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 కోర్టులు మంజూరు

చివ్వెంల(సూర్యాపేట): ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 10 కోర్టులు మంజూరు చేస్తూ శుక్రవారం న్యాయశాఖ సెక్రటరీ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. పోక్సో అండ్ నాలుగవ అదనపు జిల్లా కోర్టు (నల్లగొండ), సీనియర్ సివిల్, అండ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు (దేవరకొండ), సీనియర్ సివిల్ అండ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు (నకిరేకల్ ), సీనియర్ సివిల్ అండ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు (కోదాడ), అదనపు సీనియర్ సివిల్ అండ్ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు (నల్లగొండ), జూనియర్ సివిల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి (యాదాద్రి), మూడవ అదనపు జూనియర్ సివిల్ అండ్ మూడవ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు (నల్లగొండ), అదనపు జూనియర్ సివిల్ అండ్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు (హుజూర్‌నగర్ ), రెండవ అదనపు జూనియర్ సివిల్ అండ్ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు (కోదాడ), రెండవ అదనపు సివిల్ అండ్ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు (సూర్యాపేట) మంజూరయ్యాయి.

### జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం

వలిగొండ : ఒంటిపై కిరోసిన్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వలిగొండ మండలంలోని పులిగిల్లలో శుక్రవారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిగిల్లకు చెందిన సిలివేరు గణేష్ (34) గాలి మిషన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో కుటుంబం గడవక ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. కేకలు వేస్తుండగా స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి, క్షతగాత్రుడిని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# ‘సీఎం బ్రేక్ ఫాస్ట్’తో విప్లవాత్మక మార్పులు

● ఈ పథకంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.48లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
● సూర్యాపేటలో అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన మంత్రి జగదీష్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి అల్పాహారం భుజిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంతో పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ తగ్గించి, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయ పాలనకు నిదర్శనం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకమని అన్నారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2లక్షల 48 వేల 408 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి బ్రేక్ ఫాస్ట్ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య, కలెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్ ప్రియాంక, డీఈఓ అశోక్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ రామానుజుల రెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, జెడ్పీ బాలుర పాఠశాల హెచ్ఎం గోలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆరే రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ**

సూర్యాపేట: సీఎం కేసీఆరే రాష్ట్రానికి గ్యారెంటీ అని, బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ సమాజానికి వారంటీ అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ కార్యాలయం ఆవరణలో రూ.50 కోట్లతో నిర్మించనున్న క్రీడా పాఠశాల, అంతర్జాతీయ స్థాయి ఆధునిక స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ట్యాంక్‌బండ్ సమీపంలో రూ.80 లక్షలతో నిర్మించిన కుమ్మరి సంక్షేమ భవన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూర్యాపేటలో తొమ్మిదిన్నర ఏళ్లలో రూ.7,500 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి హ్యాట్రిక్ విజయంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ప్రియాంక, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వై.వెంకటేశ్వర్లు, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, నామా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, పక్కన ఎంపీ బడుగుల లింగయ్య, కలెక్టర్ వెంకట్రావు

**అభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

చివ్వెంల(సూర్యాపేట): యాదవులు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి కోరారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులోని యాదవుల సంక్షేమభవన నిర్మాణానికి, ఖాసీంపేట–మోదిన్‌పురం గ్రామాల మధ్య ఎస్సారెస్పీ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా బీబీగూడెం గ్రామంలో బంజారా భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్ రెడ్డి, జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలి


● ఈఎన్‌సీ నాగేంద్రరావు



డిండి ప్రాజెక్టు తూముల షెటర్స్ పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నాగేంద్రరావు

డిండి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు వద్ద చేపట్టిన మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఎన్‌సీ (ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్) నాగేంద్రరావు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షాధారంతోపాటు కేఎల్‌కేవై ద్వారా నిండుతున్న డిండి ప్రాజెక్టుకు భవిష్యత్‌లో పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నిరంతరం నీరు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రాజెక్టు వద్ద చేపట్టిన మరమ్మతు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. డిండి ప్రాజెక్టు నుంచి సాగుకు నీరు విడుదలయ్యే తూములకు ఏర్పాటు చేసిన షెటర్స్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు మట్టికట్ట దెబ్బతినకుండా రెయిన్ చూట్, స్పిల్‌వే వద్ద ఉన్న ఆవరాన్ పోర్షన్స్, కుడి కాలువ అలుగు వద్ద మరమ్మతులు చేపట్టడంతోపాటు ప్రాజెక్టుకు ఎడమ, కుడి కాలువలకు ఉన్న డిస్ట్రిబ్యూటర్లన్నింటికీ నూతన తలుపులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మతు పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, నవంబర్ నెలలో తిరిగి ప్రాజెక్టును విజిట్ చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఈఈ వెంకటరాములు, డిప్యూటీ ఈఈ నాగజ్యోతి, డిండి ఈఈ శ్రీధర్ రావు, డీఈ శ్రీనివాసులు, ఏఈ ఫయాజ్ తదితరులు ఉన్నారు.

# కోటి శివలింగార్చనకు శివలింగాలు సిద్ధం



సిద్ధం చేసిన శివలింగాలు

భూదాన్‌పోచంపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాశీలో కార్తీకమాసంలో నిర్వహించే కోటి శివలింగార్చన కార్యక్రమానికి పోచంపల్లిలోని శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ పుండరీక భక్త సేవా సమాజం ఆధ్వర్యంలో లక్షా 43వేల శివలింగాలను తయారు చేశారు. ఈమేరకు శుక్రవారం శివలింగాలను సంప్రోక్షణ చేసి దేవాలయంలో ప్రతిష్టామూర్తులకు అభిషేకం, అర్చన జరిపించారు. సాయంత్రం పురవీధుల గుండా శివలింగాలకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు తంగిరాల రామచంద్రసాయి, మీనాక్షి, మల్లేశ్వరరావు, అవధాని సురభి శంకర శర్మ, రాంప్రసాద్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా మార్కండేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్ మాట్లాడుతూ కాశీలో ప్రతిఏటా కార్తీక మాసంలో జరిగే కోటి శివలింగార్చనకు దేశవ్యాప్తంగా ప్రముఖ ప్రదేశాల నుంచి శివలింగాలను తయారు చేస్తారని తెలిపారు. అందులో భాగంగానే పోచంపల్లిలోని శ్రీ మార్కండేశ్వరస్వామి దేవాలయంలో పుండరీక భక్త సేవా సమాజం ఆధ్వర్యంలో గత నెల 18న శివలింగాల తయారీని ప్రారంభించామన్నారు. 15రోజుల్లో లక్షా 43వేల శివలింగాలను తయారు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రమణ్యం, పద్మ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, ఇంజమూరి యాదగిరి, రాజారమేశ్, గుండు వెంకటేశం, దోర్నాల గణేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రుద్ర శ్రీశైలం

భూదాన్‌పోచంపల్లి: కొనుగోళ్లు లేక కోట్లాది రూపాయల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయని, వెంటనే ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను కాపాడాలని పోచంపల్లి చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని రమాదేవి ఫంక్షన్ హాల్‌లో చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రింటెడ్ చీరలు మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో చేనేత పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. దసరా సీజన్ వచ్చినా పోచంపల్లి మార్కెట్‌లో వస్త్ర వ్యాపారం దివాలా తీసిందని పేర్కొన్నారు. దీంతో చేనేత కార్మికులకు పని కల్పించలేకపోతున్నామన్నారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసినట్లుగానే ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత పరిశ్రమను దెబ్బతీస్తున్న పోచంపల్లి ఇక్కత్ ప్రింటెడ్ చీరెల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానాలు చేశామని తెలిపారు. సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు అంకం మురళి, ఉపాధ్యక్షుడు వనం బుచ్చిదాసు, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఏలే పాండు, సహాయ కార్యదర్శి ఆడెపు ఆంజనేయులు, సలహాదారుడు భోగ రమేశ్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు రాపోలు శ్రీనివాస్, పాలాది యాదగిరి, నక్క రాంచంద్రం, మేకల రామకృష్ణ, చెన్నకేశవులు, కుడికాల బలరాం, కుమార్, నరహరి, ధనుంజయ్య, వెంకటేశ్, అంకం యాదగిరి, నర్సింహ, దామోదర్, అంబదాస్, వెంకటేశ్, నాగయ్య, రాము, మురళి, భావనారుషి, ధర్మేందర్, శ్రీను, తడక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సేవలో సహకార బ్యాంకు

● డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



సహకార బ్రాంచ్ ప్రారంభోత్సవంలో గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రైతులకు రుణాలు అందించడంలో ముందంజలో ఉందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని డీవీకే రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సహకార బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు, బంగారు రుణాలు, విదేశీ విద్య రుణాలు అందించడంలో ముందు ఉన్నామని తెలిపారు. రైతాంగానికి సేవలు విస్తరించడానికి బ్రాంచ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, డీసీసీబీ సీఈఓ మదన్‌మోహన్, డైరెక్టర్లు అందెల లింగంయాదవ్, పాశం సంపత్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక డీసీసీబీలో చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు అభ్యున్నతికి పాటు పడి రైతాంగానికి, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## రాష్ట్ర సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

కోదాడరూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కోదాడ డీఎస్పీ కార్యాలయంలో సబ్‌డివిజనల్ పరిధిలోని పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశం అనంతరం ఎస్పీ కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ– ఏపీ అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణంగా తనిఖీలు చేయాలన్నారు. అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెక్‌పోస్టు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిబ్బందికి ఎన్నికల నియమావళిపై సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ ప్రకాశ్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ రాజేష్, ఎలక్షన్ సెల్ సీఐ మహేష్, సీఐలు రాము, వీరరాఘవులు, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు ఉన్నారు.



చెక్‌పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

# రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తదితరులు

కట్టంగూర్ : రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నిమ్మ గ్రేడింగ్ మిషన్, సోలార్ కోల్డ్ రూమ్‌లను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా బయో ఫర్టిలైజర్ ఆర్గానిక్ వెజిటబుల్ వేస్ట్‌తో ఎరువులను తయారు చేయడానికి, రైతుల శిక్షణ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక యంత్రాలను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి జి. సంగీతలక్ష్మి, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీను, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, హెచ్‌ఓ ఆర్ విద్యాసాగర్, ఏఓ శ్రీనివాస్, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఐఆర్‌డీఎస్ చైర్మన్ వి రమేష్, లింగారెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్, కాపర్ వైర్ చోరీ

● మునగాలలో ఆలస్యంగా వెలుగులోకి..
● వీటి విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని అంచనా



ధ్వంసమై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మునగాల(కోదాడ): మండల పరిధిలోని సాగర్ ఎడమకాలువపై మునగాల శివారులో ఉన్న ఆర్–9 ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్, కాపర్ వైర్ చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ ఎడమకాలువకు ప్రస్తుత సీజన్‌లో సాగునీరు విడుదల చేయకపోవడంతో ఆర్– 9 ఎత్తిపోతల పథకం మూతపడింది. దీంతో సదరు ఎత్తిపోతల పథకం వద్దకు రైతులు, సిబ్బంది గత ఐదు నెలలుగా వెళ్లలేదు. ఈ క్రమంలో శుక్రవారం సాగర్ ఎడమకాలువకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో అప్రమత్తమైన ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతాంగం ఎత్తిపోతల వద్దకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు సిబ్బందితో సహా చేరుకున్నారు. ఎత్తిపోతల పథకానికి అమర్చిన 500 కేవీ, 400 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను సిబ్బంది పరిశీలించగా అవి ఓపెన్ చేసి ఉన్నాయి. గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ వాహనంలో వచ్చి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఓపెన్ చేసి అందులో ఉన్న సుమారు 800లీటర్ల ఆయిల్‌తో పాటు కాపర్ వైర్‌ను చోరీ చేసినట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ఈ చోరీ విషయాన్ని రైతులు, సిబ్బంది ఎత్తిపోతల పథకం చైర్మన్ లింగారెడ్డికి తెలపడంతో ఆయన సంబంధిత శాఖకు చెందిన డీఈ అనంద్, ఏఈ దుర్గయ్యలకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా.. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

## 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కేతేపల్లి: మండలంలోని చీకటిగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యం దందా జోరుగా జరుగుతుందనే పక్కా సమాచారంతో సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు శుక్రవారం కేతేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు చీకటిగూడెంలో బొజ్జ సుధాకర్ అనే వ్యక్తి అద్దెకు ఓ నివాస గృహం తీసుకుని, లబ్ధిదారుల నుంచి సేకరించిన 10 క్వింటాళ్ల (20 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచగా అధికారులు పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని నకిరేకల్‌లోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌కు తరలించి కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీటీ జ్యోతి తెలిపారు. సుధాకర్‌పై కేసు నమోదు చేశామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్: ఉరేసుకొని వలస కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలోని ఓ టింబర్ డిపోలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా చిత్రకోట్ మండలానికి చెందిన సోమనాథ్ నాగు(23) జీవనోపాధి కోసం కొద్ది రోజుల క్రితం మండల పరిధిలోని ఆరెగూడేనికి వచ్చాడు. గ్రామంలోని ఓ టింబర్ డిపోలో కూలీగా పని చేస్తున్నాడు. స్థానికంగా సహచరులతో కలిసి ఓ గదిలో ఉంటున్నాడు. కొద్దిరోజులుగా కుటుంబ సమస్యలతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం తన గదిలో ఇంటి పైకప్పుకు టవల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే బహిర్భూమికి వెళ్లిన రూములోని సహచరులు వచ్చేసరికి మృతిచెంది ఉన్నాడు. వెంటనే టింబర్ డిపో యజమానితో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చౌటుప్పల్ తరలించారు. మృతుడి మేనమామ లచ్చిన్‌మారియ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

## రెండిళ్లలో చోరీ

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట): ఆత్మకూర్ మండల కేంద్రంతోపాటు, చింతపల్లి మండల పరిధిలోని మల్లారెడ్డి గ్రామంలో శుక్రవారం రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన విసవరం వెంకటనరసింహారెడ్డి దంపతులు శుక్రవారం 9 గంటల సమయంలో వ్యవసాయ పనుల కోసం బావి వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి వెనక తలుపును తీసి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులకొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు రింగులు, చైన్‌లతో పాటు రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. 3 గంటల సమయంలో వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన వెంకటనరసింహారెడ్డి దంపతులు ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో లోపలికి వెళ్లిచూడగా బీరువా తెరిచి ఉంది. చోరీ చేశారని గ్రహించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు క్లూస్‌టీంతో అక్కడికి చేరుకున్నారు. వెంకటనరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.



బీరువా తెరిచి చిందరవందరగా పడేసిన దుస్తులు

**మల్లారెడ్డిపల్లిలో బంగారం, నగదు చోరీ**

చింతపల్లి: మండల పరిధిలోని మల్లారెడ్డి గ్రామానికి చెందిన సిరసనగండ్ల కృష్ణయ్య ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడు, నాలుగు తులాల నాను, 25 తులాల వెండి, రూ.20వేల నగదును అపహరించుకెళ్లారు. బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## కుర్రంపల్లిలో ఇల్లు దగ్ధం

చింతపల్లి: మండల పరిధిలోని కుర్రంపల్లిలో విద్యుదాఘాతంతో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన దోమకొండ మల్లమ్మ మధ్యాహ్న సమయంలో వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లింది. ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న తులం బంగారం, రూ.20వేల నగదు, 20 తులాల వెండి దగ్ధమైందని బాధితురాలు తెలిపింది.

## రసాయన పరిశ్రమలో కార్మికుడు మృతి

చౌటుప్పల్ : రసాయన పరిశ్రమలో ప్రమాదవశాత్తు వెలువడిన కెమికల్‌ను పీల్చిన ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని జయ ఫార్మా కంపెనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి కృష్ణ(25) జయ ఫార్మా కంపెనీలో గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి చౌటుప్పల్‌లో నివాసం ఉంటూ కంపెనీకి వెళ్లి వస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. కంపెనీలోని కెమికల్ రియాక్టర్‌లో సమస్య తలెత్తడంతో విధి నిర్వహణలో ఉన్న కృష్ణ దాన్ని తెరిచాడు. ఈ క్రమంలో అందులో నుంచి అధిక మొత్తంలో విడుదలైన రసాయనాలను పీల్చాడు. వెంటనే అపస్మారక స్థితిలో పడిపోవడంతో గమనించిన సహచరులు హుటాహుటిన 108 అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కంపెనీ ఎదుట ఆందోళన చేయగా.. అన్ని విధాలుగా ఆదుకుంటామని పరిశ్రమ యాజమాన్యం హామీ ఇచ్చింది. మృతుడి భార్య సుష్మాస్వరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం భువనగిరి మండలం అనంతారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎర్రబెల్లి నరసయ్య (68) ఈనెల 3వతేదీన ఉదయం ఎల్లమ్మ గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. దర్శనం అనంతరం ఇంటికి తిరుగు వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా భువనగిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే కారు అతివేగంగా వచ్చి ఎర్రబెల్లి నర్సయ్యను ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం 108లో భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని రూరల్ ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

## ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సస్పెన్షన్

భువనగిరి రూరల్: చందుపట్ల వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మందడి లక్ష్మీనరసింహారెడ్డి అవినీతికి పాల్పడ్డాడని వచ్చిన ఫిర్యాదుల మేరకు అతడిని రాష్ట్ర కోఆపరేటివ్ రిజిస్ట్రార్ రఘునందనరావు సస్పెండ్ చేశారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా గతంలో మెజారిటీ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కోర్టుకు సైతం వెళ్లారు. విచారణ అనంతరం రూ.30లక్షలకు పైగా అవినీతికి పాల్పడ్డాడని తేలడంతో శుక్రవారం ఆయనను సస్పెండ్ చేస్తూ వైస్ చైర్మన్ గా ఉన్న ఎలిమినేటి మల్లారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.